క్లుప్తంగా

మందుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): అర్హులకు సంక్షేమ ఫలాలు అందజేయడానికి కృషి చేస్తున్నామని 30వ డివిజన్ కార్పొరేటర్ జానారెడ్డి అన్నారు. డివిజన్‌లోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ కార్యాలయంలో శుక్రవారం.. సాంకేతిక కారణాలతో పింఛన్ నిలిచిపోయిన వారికి కార్పొరేటర్ సొంత ఖర్చులతో మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆరుగురికి తాను రూ.10 వేలు ఖరీదు చేసే మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. త్వరలోనే వారికి పింఛన్ వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నేతలు దుర్గారావు, సీహెచ్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరి పీఠంలో ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన వసంత నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకం సుభిక్షంగా ఉండటానికి భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందడానికి తొలిసారె అమ్మవారు స్వీకరిస్తారన్నారు. లోక కల్యాణార్థం తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి విశేష అర్చనలు చేస్తారన్నారు.

లేపాక్షి థీమాటిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ హస్త కళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులోని బాపు మ్యూజియంలో ఏర్పాటు చేసిన లేపాక్షి థీమటిక్ ఎగ్జిబిషన్ ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌కు వెళ్లి ఉత్పత్తులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రాచీన హస్త కళలు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దమన్నారు. లేపాక్షి మేనేజర్ ఎం. సురేష్ మాట్లాడుతూ ఎగ్జిబిషన్ ఈ నెల 12వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని సెలవు దినాల్లో కూడా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి, హెచ్‌పీఓఎం సువర్చల, హస్త కళల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ రమాదేవి, జనరల్ మేనేజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన 'శారద' విద్యార్థులు



పాయకాపురం(విజయవాడరూరల్): కళా భారతి చైల్డ్ ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్(ఔరంగాబాద్, మహారాష్ట్ర) నిర్వహించిన నేషనల్ కలరింగ్ (2022) పోటీల్లో శాంతినగర్‌లోని శారద విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబర్చి పతకాలను సాధించారు. డ్రాయింగ్, ఎస్సే రైటింగ్, హ్యాండ్ రైటింగ్ విభాగాల్లో గత నెల 28న నిర్వహించిన పోటీల్లో శారద విద్యాలయం విద్యార్థులు డ్రాయింగ్.. 12 సంవత్సరాల విభాగంలో బి.శంసియా, 10 సంవత్సరాల విభాగంలో వి.సంజన బంగారు పతకాలు సాధించడంతో శుక్రవారం స్కూల్లో అభినందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లా వాకర్స్ గవర్నర్ రామలింగరాజు, శారద స్కూల్ కన్వీనర్ పి.అప్పలరాజు, కరాటే మాస్టర్ బల్లం కిషోర్, ప్రధానోపాధ్యాయురాలు సురేఖ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసి సెల్‌ఫోన్‌తో పరార్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని యువకుడు పాల వ్యాపారిపై దాడి చేసి జేబులోని సెల్‌ఫోన్ లాక్కుని పరారైన ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం అయోధ్యనగర్‌లోని సదనం అపార్ట్‌మెంట్‌లో నివసించే రామశేషాద్రి పాల ప్యాకెట్లు హోం డెలివరీ చేస్తుంటాడు. ఈ శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో సత్యనారాయణపురం శివాజీకేఫ్ సెంటర్ ప్రగతి బుక్‌స్టాల్ వద్ద పాల ప్యాకెట్లు సర్దుకుంటుంటున్నాడు. ఆ సమయంలో గుర్తు తెలియని యువకుడు ద్విచక్ర వాహనంపై అతని వద్దకు వచ్చి ఒకసారి సెల్‌ఫోన్ ఇవ్వాలని అడగ్గా.. ఎందుకు ఇవ్వాలి అని సమాధానం చెప్పాడు. ఆ యువకుడు రామశేషాద్రిపై దాడి చేసి జేబులోని సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుపై ఎస్ఎన్‌పురం పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు ప్రగతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కండ్రికలో వ్యవసాయ పరపతి సంఘం భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): రైతు ప్రగతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విలేజి కుందావారి కండ్రికలో రూ.43 లక్షల వ్యయ అంచనాతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన భవన నిర్మాణానికి శుక్రవారం డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ కండ్రిక, సీతారామపురం, మంగళాపురం, అప్పారావుపేట, నైనవరం గ్రామాల రైతులకు మేలు కలిగేలా అధునాతన హంగులతో స్ట్రాంగ్ రూం సదుపాయం ఉండేలా భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. జనాభాలో 62 శాతం మందికి ఉపాధి కల్పించే వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని చెప్పారు. గత చంద్రబాబు ప్రభుత్వం కంటే అధికంగా మూడున్నరేళ్లలో రూ.55,401 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. కండ్రికలోనే రూ.5 కోట్లతో ధాన్యాన్ని సేకరించినట్లు తెలియచేశారు. ఈ ప్రాంతంలో ఎస్‌పీఎస్‌సీ, గోడౌను నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి బోస్ నగర్ నుంచి కుందావారి కండ్రిక వరకు రహదారి నిర్మాణానికి రూ.3 కోట్లతో టెండర్లను పిలవగా, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ రూ.15లక్షలతో పోలవరం కాలవ నుంచి రైతుల సాగు అవసరాల నిమిత్తం తూము ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కనకదుర్గ దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్ జానారెడ్డి, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్, సొసైటీ అధ్యక్షులు ఎం.రవీంద్ర రెడ్డి, సభ్యులు పసుపులేటి వెంకట్రావు, దావు కోటేశ్వరావు, పాలకేంద్రం అధ్యక్షుడు మంగారెడ్డి, నున్న సొసైటీ అధ్యక్షుడు పోలారెడ్డి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ రావాలి

'గడప గడప'లో లబ్ధిదారులు



ప్రజాశక్తినగర్‌లో.. 'గడప గడప'లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): కరోనా కష్ట కాలంలో మా కుటుంబాలకు అండగా ఉన్న జగనన్నే మళ్లీ రావాలని మహిళలు ఆకాంక్షించారు. శుక్రవారం ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు 64వ డివిజన్ 285వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాధానగర్లోని మహిళలు ఎమ్మెల్యే విష్ణుకు స్వాగతం పలికారు. ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో మాకు అండగా ఉంటూ నిత్యావసరాలను పంపిణీ చేసి, ప్రతి నెలా పింఛన్లు ఇవ్వడమే కాకుండా, విద్యార్థుల అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, డ్వాక్రా గ్రూపుల రుణమాఫీ, సున్నవడ్డీతో ఆర్థిక సాయం అందజేశారని లబ్ధిదారులు తెలిపారు. ఆటో డ్రైవర్ ముత్యాలరావు వాహనమిత్ర పథకంలో ఏటా పది వేల ఆర్థిక సహాయం అందజేశారని, ఇంటి స్థలం మంజూరు చేశారని, తాను ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించానని చెప్పాడు. గాజుల వ్యాపారి ఉదయేశ్వరావు తన కూతురు ఇంజినీరింగ్ చదువుతోందంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంటు వల్లేనని చెప్పాడు. జి.విజయ, మీనాక్షీదేవి, రామలక్ష్మి, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఆయన సంబంధిత అధికారులను పిలిచి సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఇళ్ల వద్ద పుస్తకం పెట్టి ప్రజలతో సంతకాలను చేయించి పనులు నిర్వహించాలని ఎమ్మెల్యే విష్ణు అధికారులకు సూచించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మలతో కలిసి ఎమ్మెల్యే 241 గడపలను సందర్శించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు.

పేదల సంక్షేమమే ప్రధాన అజెండా

పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ప్రధాన అజెండాగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని విష్ణు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏమైనా సాంకేతిక కారణాల వలన అందకపోతే వారికి న్యాయం చేయడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజల మధ్య పర్యటించి ఏనాడైనా సమస్యలు తెలుసుకున్నారా..? అని ప్రశ్నించారు. వాహనమిత్ర: పర్యటనలో భాగంగా ఆటో కార్మికులతో ఎమ్మెల్యే మల్లాది విష్ణు కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరావు, సీడీఓ జగదీశ్వరి, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్, వైసీపీ డివిజన కోఆర్డినేటర్ షేక్ ఇస్మాయిల్, అధ్యక్షులు శివ, యర్రగొర్ల శ్రీరాములు, అక్కిశెట్టి నారాయణ, పందిరి వాసు, మేడా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛను సద్వినియోగం చేసుకోవాలి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నేటి మహిళకు పూర్తిగా స్వేచ్ఛ ఉందని భావిస్తున్నానని, దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత వారిపైనే ఉందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉండాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించి ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని సిప్ అబాకస్ వన్‌టౌన్/భవానీపురం బ్రాంచిల ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథి మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటేనే వారికిష్టమైన రంగంలో రాణించగలరన్నారు. తానూ భర్త, అత్తమామల ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. మరో అతిథి డాక్టర్ కె.లత ఆరోగ్యపరంగా మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సిప్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ హెడ్ మధుసూదనరావు మాట్లాడుతూ మహిళలు సమాజానికి వెన్నెముకలని, వారిని గౌరవిస్తే మనల్ని మనం గౌరవించుకున్నట్లేనని చెప్పారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు మహారాణులుగా అభివర్ణించారు. కార్పొరేటర్ పడిగపాటి చైతన్యరెడ్డి మాట్లాడుతూ మహిళల విజయానికి వారి నిబద్ధతే కారణమని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మేయర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ లతను సత్కరించి జ్ఞాపికలు ఇచ్చారు. అనంతరం మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

అట్టహాసంగా వికసిత్ ఫెస్ట్



వికసిత్ ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): గ్రామంలోని వికాస్ విద్యాసంస్థల్లో శుక్రవారం వికసిత్ ఫెస్ట్–2కె23 అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్విజ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, రోబోరేస్ తదితర పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల వైస్ చైర్మన్ ఎన్.సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్స్ బి.రమణ, రామ్మోహనరావు, కిషోర్ బాబు, వికసిత్ కన్వీనర్లు బి.వి.రెడ్డి, బి.సురేష్ పాల్గొన్నారు.

విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలి

పన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయ ఇంధన వనరుల పొదుపు నేపథ్యంలో విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరగాలని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వరంగల్) ఆచార్యులు డాక్టర్ వినయ్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో 'కంట్రోల్ ఆఫ్ ఎలక్ట్రిక్ మోటార్ డ్రైవ్స్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ అప్లికేషన్స్' అంశంపై శుక్రవారం వెబినార్ నిర్వహించారు. డాక్టర్ వినయ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ, ఆధునీకరణ నేపథ్యంలో విద్యుత్ వాహనాల వినియోగం ప్రాధాన్యం పెరిగిందన్నారు. సంప్రదాయ ఇంధన వనరుల కొరత, వాటి వినియోగంతో పెరిగే కాలుష్యంతో సమాజానికి తీవ్రమైన ప్రమాదాలు కలుగుతున్నాయని చెప్పారు. ఆ క్రమంలో సంప్రదాయేతర ఇంధన వనరులను పెంపొందించుకోవాల్సిన అవసరముందన్నారు. విద్యుత్ వాహనాలను రోడ్డు రవాణా వ్యవస్థలతో పాటు అంతరిక్ష నౌక వ్యవస్థలోనూ వినియోగిస్తున్నారని వివరించారు. ఈ రంగంలో అపూర్వ ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. వాటిపై పట్టు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వినియోగంపై అనేక అద్భుత ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చాయన్నారు. కాలుష్య నివారణకు బీఎస్6 ఇంజిన్ వాహనాల వినియోగాన్ని తప్పనిసరి చేసిందన్నారు. విద్యుత్ వాహనాల వినియోగంపై మరిన్ని ప్రయోగాలు జరుగుతున్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మార్పులు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమాన్ని విభాగాధిపతి డాక్టర్ రాజేంద్రబాబు నిర్వహించగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించాలి



గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఎం నేతల నిరసన

పాయకాపురం(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబురావు డిమాండ్ చేశారు. సీపీఎం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ప్రకాష్‌నగర్ సెంటర్లో కార్మికుల అడ్డావద్ద నిరసన కార్యక్రమం జరిగింది. పార్టీ సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.దుర్గారావు, నగర కమిటీ సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై నగరానికి చెందిన ఎస్. రిషిత బృందంలోని రిషిత, భావన, భార్గవి, ధన్య, అద్విత, అమృత, జశ్విత, అరిశులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం చేయించారు.

యువజనోత్సవాల్లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సిద్ధార్థ అకాడమీ, సిద్ధార్థ కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బెంగళూరులోని జైన్ డీమ్డ్ యూనివర్సిటీలో గత నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరిగిన 36వ అంతర్ విశ్వవిద్యాలయాల జాతీయ యువజనోత్సవాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి పలు విభాగాల్లో బహుమతులు పొందారని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం సాయంత్రం కళాశాల ఆవరణలోని మైదానంలో ఉన్న వేదికపై అభినందించారు. సిద్ధార్థ అకాడమీ కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉచిత విద్యను అందజేస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ సీ.జంపాల, సిద్ధార్థ అకాడమీ అకడమిక్ సలహాదారుడు ఎల్‌కే.మోహనరావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్‌తో పాటుగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

ఆటోనగర్(విజయవాడతూర్పు): శ్రీగురుసింగ్ సభ గురుద్వార్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గురునానక్‌కాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కన్వల్‌జీత్‌సింగ్, హరమోహిందర్‌సింగ్, జేజే సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గైనకాలజీ, జనరల్ డిసిన్, పిడియాట్రిక్, స్కిన్,హెయిర్, తదితర వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇస్తారని పేర్కొన్నారు.

అన్ని వర్గాలకూ సముచిత స్థానం



ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను కలిసిన దుర్గ గుడి పాలకమండలి చైర్మన్ రాంబాబు, సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ సముచిత స్థానం లభిస్తోందని ఎమ్మెల్సీ రుహుల్లా తెలిపారు. దుర్గగుడి నూతన పాలకవర్గం చైర్మన్, సభ్యులు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాను సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు కట్టా సత్తయ్య, బుద్దా రాంబాబు, చింతా సింహాచలానికి ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని గుర్తించి దుర్గగుడి పాలకమండలి సభ్యులుగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. సామాన్య కార్యకర్తగా ఉన్న నన్ను ఎమ్మెల్సీ స్థానంలో కూర్చోబెట్టారంటేనే జగనన్న మనస్సు ఏంటో అర్థమవుతోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హాఫీజుల్లా, ఓసూరి బాలరమేష్, అమిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు

కలెక్టర్ ఢిల్లీరావు



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన మనస్సు, ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు విద్యార్థులకు సూచించారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ మున్సిపల్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సబ్జెక్టుల్లోవారిని ప్రశ్నలు అడిగారు. గణితంలోని ట్రిగ్నోమీటర్ డయాగ్రాంను బోర్డుపై వేసి దానిపై విద్యార్థులను జవాబులు అడిగి వారి సందేహాలను నివృత్తి చేశారు. పదో తరగతి జీవితంలో మంచి టర్నింగ్ పాయింట్ అన్నారు.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని, విద్యార్థులకు ఇచ్చిన మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని కలెక్టర్ ఢిల్లీరావు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు సూచించారు. పాఠశాల ఆవరణలో అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ముఖ్యంగా బాలికలకు రక్తహీనతను నివారించేందుకు అందిస్తున్న ఐరన్ ట్యాబ్లెట్లను విద్యార్థినులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నాడు–నేడు పథకం ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు. కిచెన్ షెడ్‌లు,టాయిలెట్‌లు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, రక్షిత మంచినీటి వసతి, విద్యుత్‌సౌకర్యం, గ్రీన్ చాక్ బోర్డు, ఇంగ్లిష్ ల్యాబ్‌లు కల్పించడానికి కోట్లాది రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. నార్త్‌జోన్ తహసీల్దార్ చందన దుర్గాప్రసాద్, ఆర్ఐ అనిల్, వీఆర్ఓలు మోహన్, కమల్, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు నిజాయతీ

రోడ్డుపై పడిపోయిన మొబైల్ అందజేత



సతీష్‌కు ఫోన్ అందజేస్తున్న హోంగార్డ్ రాజశేఖర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్డుపై పడిపోయిన మొబైల్ ఫోన్‌ను తిరిగి దాని యజమానికి అప్పగించిన హోంగార్డ్ నిజాయతీని చాటుకున్నాడు. వివరాలు ప్రకారం సతీష్ అనే వ్యక్తి గొల్లపూడి సారాయి కొట్టు సెంటర్‌లో షామియానా షాపు నిర్వాహకుడు. ఈ క్రమంలో అతను శుక్రవారం పనులపై భవానీపురం వెళ్లి తిరిగి తన షాపునకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. గొల్లపూడి మైలురాయి సెంటర్ (వై జంక్షన్) మీదుగా వెళ్తుండగా ప్యాంట్ జేబులోని మొబైల్ ఫోన్ జారి అక్కడ పడిపోయింది. అది గమనించకుండా షాపు దగ్గరకు వెళ్లి పోయిన అతను ఫోన్ కోసం చూశాడు. కనపడక పోయేసరికి కంగారు పడుతూ వెతుకులాట ప్రారంభించాడు. వై జంక్షన్‌లో పడిపోయిన ఫోన్‌ను అక్కడ ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ రాజశేఖర్ చూశారు. దానిని తీసుకుని ఫోన్ పౌచ్‌లో ఉన్న సతీష్ విజిటింగ్ కార్డ్‌లో నెంబర్ చూసి ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో అతను హడావుడిగా వై జంక్షన్‌కు రాగా రాజశేఖర్ ఫోన్ తిరిగి అప్పగించారు. పోయిందనుకున్న ఫోన్ ట్రాఫిక్ పోలీస్ ద్వారా మళ్లీ దొరికినందుకు సంబరపడిపోతూ ఆయనకు థ్యాంక్స్ చెప్పి వెళ్లాడు. కాగా ట్రాఫిక్ సిఐ రామచంద్రరావు హోంగార్డ్ రాజశేఖర్ నిజాయతీని మెచ్చుకుని అభినందించారు.

సింగ్‌నగర్‌లో విషాదఛాయలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చోడవరం వద్ద కృష్ణానదిలో స్నానానికి వెళ్లిన సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లో నివసిస్తున్న జారా బిర్యాని పాయింట్ ప్రొప్రయిటర్ అబ్దుల్ రహీమ్ బాషా(34) మృత్యువాత పడడంతో సింగ్‌నగర్‌లో శుక్రవారం విషాదఛాయలు అలముకున్నాయి. అతని మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఎప్పుడు నవ్వుతో, ఆప్యాయంగా పలకరించే రహీమ్‌బాషా మృత్యువాత పడడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. రహీమ్ బాషా పన్నెండేళ్ల క్రితం సమీరా అనే మహిళను ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం. సంతోషంగా సాగుతున్న వారి కుటుంబంలో రహీమ్‌బాషా మృతి తీరని శోకం కలిగిస్తోంది.

ఎదురుచూపులు

మొగల్రాజపురం పుష్పాహోటల్ సెంటర్ వద్ద నివసిస్తున్న తాళ్లూరి కిరణ్ హోటల్‌లో పని చేస్తుంటాడు. ఇతనికి భార్య, కొడుకు ఉన్నారు. కిరణ్ చోడవరం వద్ద కృష్ణానదిలో గల్లంతయ్యాడని తెలియడంతో అతని తల్లిదండ్రులు, భార్యా,పిల్లలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చోడవరం వద్దకు వెళ్లి కిరణ్ ఆచూకీ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

పెనమలూరు: కానూరులో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం ఐదో వార్షికోత్సవం శుక్రవారం ముగిశాయి. మాజీ సర్పంచ్‌లు అన్నే సుజాత, అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి దంపతుల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించారు. వార్షికోత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం స్వామివారి కల్యాణం జరిగింది. శుక్రవారం గ్రామోత్సవం, పవళింపుసేవ, అన్నసమారాధన చేశారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): అర్హులకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వీఎంసీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. రాణిగారితోటలో శుక్రవారం 17, 18 డివిజన్లలో నివసిస్తున్న రాజస్థాన్, యూపీ రాష్ట్రాలకు చెందిన ప్రజలతో ఆయన సమావేశం నిర్వహించారు.

దోమల నివారణకు చర్యలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో శుక్రవారం సాయంత్రం దోమల నివారణ చర్యల్లో భాగంగా మలేరియా విభాగం ఆధ్వర్యాన ఫాగింగ్ నిర్వహించారు. మురుగు కాల్వల్లో పైరత్రమ్ స్ప్రే చేశారు. మలేరియా విభాగం సిబ్బంది కర్నాటి నరసింహారావు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు.